సాక్షి నంద్యాల

గురువారం । 18 । ఏప్రిల్ । 2024



భక్తుల సందడి

మహానంది: శ్రీరామనవమి సందర్భంగా క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. వేలాది మంది భక్తులు కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి, కోదండరాముల వారిని దర్శించుకున్నారు.



శ్రీమఠంలో విద్యాధీశ తీర్థులు

మంత్రాలయం: ధార్మిక పర్యటనలో భాగంగా కర్ణాటకలోని హడిపి పలిమారు మఠం పీఠాధిపతి విద్యాధీశ తీర్థులు, ఉప పీఠాధిపతి విద్యారాజేశ్వర తీర్థులు బుధవారం మంత్రాలయం వచ్చారు.



మల్లన్నకు నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: నిత్యకళావేదికపై బుధవారం విజయనగరానికి చెందిన అభినయ ప్రియ నర్తనశాల, పెద్దదోర్నాలకు చెందిన యు.రమణయ్య వారి సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లింపు

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం ఈనెల 18 నుంచి 24వ తేదీలోగా ఫీజు చెల్లించాలని నంద్యాల జిల్లా ఇంటర్ విద్యాధికారి సునీత బుధవారం తెలిపారు. మార్కులు తక్కువగా వచ్చిన విద్యార్థులు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం ఇదే తేదీల్లో ఫీజు చెల్లించాలని సూచించారు. జవాబు పత్రాల ఒక్కొక్క పేపర్ రీ వెరిఫికేషన్‌కు రూ.1,300, రీకౌంటింగ్‌కు రూ.260 చెల్లించాలన్నారు. సప్లిమెంటరీ పరీక్షల కోసం ఇంటర్మీడియెట్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు పేపర్లతో సంబంధం లేకుండా రూ.550, ప్రాక్టికల్స్‌కు రూ.250, బ్రిడ్జి కోర్సులకు రూ.150 చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో అన్ని పేపర్లు ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఇంప్రూమెంట్ కోసం రూ.550 పరీక్ష ఫీజుతో పాటు పేపర్‌కు రూ.160 చెల్లించాలన్నారు. మొదటి, రెండో సంవత్సరం ఇంప్రూమెంట్ రాయాలనుకుంటే సైన్స్ విద్యార్థులు రూ.1,440, ఆర్ట్స్ విద్యార్థులు రూ.1,240 చెల్లించాలని తెలిపారు.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

నంద్యాల(న్యూటౌన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో మిగులు సీట్ల భర్తీకి విద్యార్థులు ప్రవేశ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా 1:3 నిష్పత్తిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి జిల్లాల కో ఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలురకు సంబంధించి ఎస్సీ 44 నుంచి 23 మార్కుల వరకు, ఎస్టీ 40 నుంచి 25 మార్కుల వరకు, బీసీ 47 నుంచి 45 మార్కుల వరకు ఓసీ 46 నుంచి 44 మార్కుల వరకు, బీసీ -సీ 17 నుంచి 14 మార్కుల వరకు పొందిన బాలురకు ఈ నెల 26వ తేదిన కల్లూరు మండలం చిన్నటేకూరు పాఠశాలలో కౌన్సిలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. బాలికలకు సంబంధించి ఎస్‌సీ 47 నుంచి 18 మార్కుల వరకు, ఎస్‌టీ 37 నుంచి 19 మార్కుల వరకు, బీసీ 47 నుంచి 42 మార్కుల వరకు, ఓసీ 47 నుంచి 36 మార్కుల వరకు పొందిన బాలికలకు ఈ నెల 29వ తేదిన కర్నూలు మండలం దిన్నెదేవరపాడులోని గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ ఉంటుందని తెలిపారు. బాల బాలికలకు నిర్దేశించిన కేంద్రాల్లో ఆయా తేదీల్లో ఉదయం 8.30 గంటలకే కౌన్సెలింగ్ ప్రారంభం అవుతుందన్నారు. విద్యార్థులు తమ మెరిట్ కార్డు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు నకలు కాపీలతో హాజరు కావాలన్నారు. మరింత సమాచారానికి 08518-295601, 9010070219 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఇక సమరమే!

- నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం
- జిల్లాలో ఒక పార్లమెంట్, ఆరు అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు
- మొదటి రోజే శ్రీశైలం సిట్టింగ్ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి నామినేషన్
- ఇక ఊపందుకోనున్న ప్రచారం

2024 సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టానికి కౌంట్ డౌన్ మొదలైంది. మరో కొన్ని గంటల్లో అంటే గురువారం 11 గంటల నుంచి సార్వత్రిక సమరానికి కీలక అడుగు పడనుంది. నోటిఫికేషన్ విడుదలతో పాటు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కూడా మొదలవుతుంది. దీంతో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. నంద్యాల పార్లమెంట్ స్థానంతో పాటు ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. తొలిరోజు దశమి, ఆ తర్వాత ఏకాదశి రెండూ మంచి రోజులు కావడంతో తొలి రెండు రోజుల్లో అధికశాతం మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది.

నంద్యాల/ఆళ్లగడ్డ: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రధాన ఘట్టం గురువారం నుంచి మొదలు కానుంది. జిల్లాలో జరగనున్న ఒక పార్లమెంట్, ఆరు అసెంబ్లీ స్థానాలకు ఈనెల 18వ తేదీన నోటిఫికేషన్ విడుదలకానుంది. అదే రోజు నుంచి ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 21వ తేదీ ఆదివారం కావడంతో ఆ రోజు నామినేషన్లు స్వీకరించరు. 26న నామినేషన్ల పరిశీలన చేసి, 29వ తేదీ వరకు నామినేషన్ల ఉప సంహరణకు అవకాశం ఇస్తారు. 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తారు. పార్లమెంట్‌కు సంబంధించి కలెక్టరేట్‌లో, అసెంబ్లీకి సంబంధించి ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు అధికారులు అంతా సిద్ధం చేశారు. పాణ్యం అసెంబ్లీకి సంబంధించి కర్నూలు కలెక్టర్ కార్యాలయంలోని జేసీ చాంబర్‌లో నామినేషన్లు దాఖలు చేసేందుకు ఏర్పాటు చేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ, పోలీసు, నోడల్ ఆఫీసర్లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నియమావళిని, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. ఇందులో భాగంగా ఎన్నికల్లో పోటీ చేసేవారికి ఉండాల్సిన అర్హతలపై ఎన్నికల కమిషన్ దిశా నిర్దేశం చేసింది. అలాగే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసేందుకు సువిధ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎన్నికల షెడ్యూల్ మార్చి 16వ తేదీన విడుదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆంధ్రప్రదేశ్‌లో నాలుగో విడతలో ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంది. దీంతో 58 రోజులపాటు సమయం దొరికింది. అందులో ఇప్పటికే 32 రోజులు గడిచిపోయాయి. ఈ క్రమంలో మిగిలిన 26 రోజుల్లో ఎన్నికల నామినేషన్‌లు, స్క్రూటినీ, నామినేషన్ల ఉప సంహరణ, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా, పోలింగ్ తదితర ప్రక్రియలు ముగుస్తాయి.

నామినేషన్‌కు అర్హతలు ఇవే..

- అభ్యర్థికి నామినేషన్ దాఖలు చేసే రోజుకు 25 సంవత్సరాలు పూర్తయి ఉండాలి.
- రాష్ట్రంలో ఏదైనా ఓ నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండాలి.
- పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులైతే నలుగురు, స్వతంత్రంగా పోటీ చేసే అభ్యర్థులను 10 మంది ఓటర్లు బలపర్చాలి. బలపరిచే వారు అదే నియోజకవర్గానికి చెందిన ఓటర్లు అయి ఉండాలి.



నంద్యాల తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రం



నంద్యాల తహసీల్దార్ కార్యాలయం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

నామినేషన్ కేంద్రాలు, రిటర్నింగ్ అధికారుల వివరాలు..

నియోజకవర్గం	నామినేషన్ దాఖలు చేసే కేంద్రం	రిటర్నింగ్ ఆఫీసర్	ఫోన్ నంబర్
నంద్యాల	తహసీల్దార్ కార్యాలయం, నంద్యాల	రాహుల్‌కుమార్‌రెడ్డి, జేసీ, నంద్యాల	8522030888
శ్రీశైలం	తహసీల్దార్ కార్యాలయం, ఆత్మకూరు	సుధారాణి, డిప్యూటీ కలెక్టర్, నంద్యాల	9989925007
బనగానపల్లె	తహసీల్దార్ కార్యాలయం, బనగానపల్లె	ఎస్.కామేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్, నంద్యాల	8978882804
ఆళ్లగడ్డ	తహసీల్దార్ కార్యాలయం, ఆళ్లగడ్డ	మల్లికార్జునరెడ్డి, ఆర్‌డీఓ, నంద్యాల	8333989000
డోన్	ఆర్‌డీఓ కార్యాలయం, డోన్	మహేశ్వరరెడ్డి, ఆర్‌డీఓ, డోన్	7815959530
నందికొట్కూరు	తహసీల్దార్ కార్యాలయం, నందికొట్కూరు	ఎం.దాసు, ఆర్‌డీఓ, ఆత్మకూరు	7815959529

- నామినేషన్ దాఖలు చేయడానికి 48 గంటలకు ముందు అభ్యర్థులు తప్పనిసరిగా తమ పేరిట ఏదైనా గుర్తింపు పొందిన బ్యాంకులో ఖాతా తెరవాలి. ఆ ఖాతా ద్వారానే తమ ఎన్నికల ప్రచారానికి, ఇతర అవసరాలకు వెచ్చించిన సొమ్ముకు సంబంధించి లావాదేవీలు నిర్వహించాలి.

నామినేషన్ దాఖలు ఇలా..



ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి సువిధ యాప్ ద్వారా నామినేషన్ దాఖలు చేసిన తర్వాత హార్డ్ కాపీలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేయాలి.

- నామినేషన్ హార్డ్ కాపీలు అందజేసే సమయంలో ఆర్వో చాంబర్‌లోకి అభ్యర్థితో పాటు ఐదుగురిని మాత్రమే అనుమతిస్తారు.

నోటిఫికేషన్‌లో ముఖ్యమైన తేదీలు

నామినేషన్ల ప్రారంభం	- ఏప్రిల్ 18
చివరి తేదీ	- ఏప్రిల్ 25
పరిశీలన	- ఏప్రిల్ 26
ఉపసంహరణ చివరి తేదీ	- ఏప్రిల్ 29
పోలింగ్	- మే 13
ఓట్ల లెక్కింపు	- జూన్ 04

- అభ్యర్థులు తమ ఒరిజనల్ బీ- ఫారమ్, ఏ - ఫారమ్‌లను నామినేషన్ గడువు ముగిసే రోజు మధ్యాహ్నం మూడు గంటల్లోపు అందజేయవచ్చు.
- అభ్యర్థులు రెండు (ఒకటి స్టాంప్ సైజ్, మరొకటి పాస్‌పోర్ట్ సైజ్) ఫొటోలతో పాటు తన ఓటరు కార్డు, బలపరిచే వారి గుర్తింపు కార్డు నామినేషన్‌తో పాటు అందజేయాలి.
- ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అభ్యర్థి తన సంతకం ఉండే విధానాన్ని విధిగా తెలియజేయాలి.
- బ్యాలెట్ యూనిట్‌లో తన పేరు ఎలా ముద్రించాలో వివరించి చెప్పాలి.
- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఏవైనా క్రిమినల్ కేసులు ఉంటే వాటిని మూడు దినపత్రికల్లో ప్రకటన ద్వారా బహిర్గతం చేయాలి. అందుకు అయ్యే ఖర్చును లెక్క చూపాలి.
- ఎన్నికల నామినేషన్ కేంద్రాల్లో అనువజ్ఞులైన అధికారులతో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. ఏవైనా సందేహాలుంటే అక్కడ నివృత్తి చేసుకోవచ్చు.

డిపాజిట్ ఎంత అంటే..



ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసే సాధారణ (ఓసీ, బీసీ) అభ్యర్థులు రూ. 25 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ. 12,500 డిపాజిట్ చెల్లించాలి. ఎమ్మెల్యేగా పోటీ చేసే సాధారణ అభ్యర్థులు రూ. 10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ. 5 వేల చొప్పున డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది.

మంచి ముహూర్తం చూసుకుని..



నామినేషన్ల హడావిడి నేటి నుంచి 25వ తేదీ వరకు కొనసాగనుంది. బరిలో నిలిచే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసేందుకు పండితులు, గురువులు, స్వామీజీలను ఆశ్రయించి ముహూర్తాలను నిర్ణయించుకుంటున్నారు. పంచాంగం ప్రకారం చూస్తే ఈ నెల 18, 19, 22, 23, 24 తేదీల్లో మంచి ముహూర్తాలున్నట్లు పండితులు పేర్కొంటున్నారు. కొందరు సెంటిమెంట్‌తో పాటు వారాలకు ప్రాధాన్యతనిస్తూ అందుకు అనుగుణంగా శుభగడియల్లో ముహూర్తాలను నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. మొదటి రోజు ఈనెల 18వ తేదీన శ్రీశైలం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి గురువారం ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేయనున్నారు. ఈనెల 22వ తేదీన పాణ్యం వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి, 23వ తేదీ నంద్యాల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, 24వ తేదీన ఆళ్లగడ్డ వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డి, నందికొట్కూరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్, బనగానపల్లె వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి కాటసాని రామిరెడ్డి, నంద్యాల పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి నామినేషన్లు దాఖలు చేయనున్నారు.

ప్రజలకు తెలిసేలా..



ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు నామినేషన్ల దాఖలు సమయంలో అధికారులకు సమర్పించే వివరాలను ప్రజలకు తెలిసేలా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నారు. నకలును ప్రజలు కోరితే వాటిని ఉచితంగానే అధికారులు అందజేస్తారు. రోజూ మధ్యాహ్నం 3 గంటల అనంతరం ఆ రోజు వచ్చిన నామినేషన్లపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నికల కమిషన్‌కు తెలియజేస్తారు. నామినేషన్లను, అఫిడవిట్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లోనూ నోటీసు బోర్డులోనూ ప్రజల పరిశీలనకు ఉంచుతారు. నామినేషన్ దాఖలు పారదర్శకంగా ఉండేందుకు సంపూర్ణంగా వీడియో తీయిస్తారు.

నియమావళి పాటించాల్సిందే..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నియమావళిని, నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలి. అభ్యర్థి నామినేషన్ల పత్రాల్లోని ప్రతి అంశాన్ని ఎన్నికల కమిషన్ పక్కాగా పరిశీలిస్తుంది. ఇందులో ఏమాత్రం పొరపాటు, తప్పు జరిగినా ఏమాత్రం ఉపేక్షించకుండా చెల్లుబాటు కాలేదని ప్రకటిస్తుంది. ఈ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు రాకూడదన్న ఉద్దేశంతో కొందరు డమ్మీ సెట్ దాఖలు చేయనున్నారు. మొత్తం మీద ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్లు నామినేషన్లు దాఖలు చేయడానికి అవకాశం కల్పించడం జరిగింది.

కల్యాణ వైభోగం



ప్రత్యేక అలంకరణలో సీతారామ లక్ష్మణులు



నంద్యాల సంజీవనగర్ రామాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

ఊరంతా పందిరి వేయగా.. బంధువుల్లా భక్తజనం తరలిరాగా.. పండితులు శాస్త్రోక్తంగా మంత్రాలు పఠిస్తుండగా.. రామ నామం మారుమోగుతుండగా.. సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. శ్రీరామ నవమి సంబరాలు జిల్లాలో అంబరాన్ని తాకాయి. స్వామిఅమ్మవార్ల కల్యాణాన్ని భక్తులు కనులారా వీక్షించారు. భక్తులకు ప్రసాదంగా వడపప్పు, పానకం పంపిణీ చేశారు.

– నంద్యాల (వ్యవసాయం)

ప్రజలు కోట్లను తరిమికొడతారు

- ఎక్కడా సీటు లేక డోన్‌కు వచ్చాడు
- సొంతూరు లద్దగిరికి రోడ్డు వేసుకోలేని వ్యక్తి డోన్‌కు రోడ్లు వేశారట
- నా వెంట వస్తే అభివృద్ధిని చూపిస్తా
- టీడీపీని ప్రజలు నమ్మరు
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: సీనియర్ నాయకుడని చెప్పుకునే టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డికి ఆలూరు సీటు ఇవ్వలేమంటే, ఎమ్మిగనూరు కుదరదంటే, ఆదోనిలో సాధ్యపడదంటే, కర్నూలులో కాదంటే.. చివరకు డోన్‌కు వచ్చాడని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఫ్యాక్షన్ రాజకీయాలు చేసిన కోట్లను ప్రజలు డోన్ నుంచి తరిమేస్తారన్నారు. బుధవారం పట్టణంలోని షిర్డీ సాయి కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్థిక మంత్రి బుగ్గన మాట్లాడారు. నియోజకవర్గంలో గ్రామాల పేర్లు కూడా తెలియని నాయకులు డోన్‌లో అభివృద్ధి ఏదీ అని అడుగుతున్నారన్నారు. తన వెంట వస్తే దగ్గరుండి అభివృద్ధిని చూపిస్తానన్నారు. కేంద్ర మంత్రిగా, ఎంపీగా ఉన్నత పదవులు అనుభవించిన కోట్ల తన సొంత గ్రామం లద్దగిరికి రోడ్డు వేసుకోలేదని, అలాంటి వ్యక్తి డోన్‌లో రోడ్లు వేశారంటే ప్రజలు ఎలా నమ్ముతారన్నారు. కేంద్ర రైల్వే మంత్రిగా కోచ్ ఫ్యాక్టరీ కూడా పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. వర్ష పాతం ఆధారంగా బేతంచెర్ల మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటిస్తే ప్రతిపక్షాలకు కడుపుమంట ఎందుకన్నారు.



హాజరైన కార్యకర్తలు, నాయకులు

మాది చేతల ప్రభుత్వం..

టీడీపీది అబద్దాల ప్రభుత్వమైతే వైఎస్సార్‌సీపీది సంక్షేమ ప్రభుత్వమన్నారు. అర్హతనే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. 2014లో ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదన్నారు. మహాలక్ష్మి పథకం పేరుతో పుట్టిన ప్రతి ఆడ బిడ్డకు రూ. 25 వేలిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ఏడాదికి 12 సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చి ఒక్క సిలిండర్ కూడా ఇవ్వలేదన్నారు. విద్యార్థులకు బసుపాసులు ఇవ్వాలన్నా రాయితీలతో ఆర్టీసీ నష్టపొతుందని మనసులో మాట పుస్తకం ద్వారా తన మనస్సులో మాట చెప్పారన్నారు. గతంలో పింఛన్లు, డీ పట్టాలు దగ్గర నుంచి ఏ ప్రభుత్వ సేవ అందాలన్నా జన్మభూమి కమిటీల ద్వారా లంచాలు తీసుకున్న చరిత్ర టీడీపీది అన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 99 శాతం అమలు చేశారన్నారు. రాష్ట్రంలో పులివెందుల తర్వాత అభివృద్ధి చెందిన ప్రాంతం డోన్ నియోజకవర్గం అన్నారు. ప్రజల ఆశీర్వాదంతోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దానన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో డోన్ అభ్యర్థిగా తనను, నంద్యాల ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని మంత్రి బుగ్గన అన్నారు. కార్యక్రమంలో మంత్రి బుగ్గన తనయుడు అర్జున్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కలిసికట్టుగా పని చేద్దాం

- వైఎస్‌ఆర్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి

వెలుగోడు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఆ పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సూచించారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు బుధవారం వేల్పనూరు గ్రామంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డితో రామసుబ్బారెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి, నియోజకవర్గ ఎన్నికల అబ్జర్వర్ హబీబుల్లా సమావేశమయ్యారు. పార్టీ నేతలు ఐక్యతతో ఎన్నికల్లో కలిసి పని చేయాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి బుడ్డా వెంగల్‌రెడ్డికి వైఎస్ఆర్ కుటుంబానికి సన్నిహిత సంబంధాలు ఉండేవన్నారు. వైఎస్ఆర్ మరణానంతరం బుడ్డా శేషారెడ్డి వైఎస్ జగన్ వెంట నడుస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు ఎంతో కృషి చేశారన్నారు. శ్రీశైలంలో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి 2019 కంటే ఈసారి అత్యధిక మెజారిటీతో శిల్పా చక్రపాణిరెడ్డిని, నంద్యాల ఎంపీగా పోచా బ్రహ్మనందరెడ్డిలను గెలిపించేందుకు కృషి చేయాలని నేతలుకు సూచించారు.



వేల్పనూరులో సమావేశమైన వైఎస్ఆర్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి, ఎన్నికల అబ్జర్వర్ హబీబుల్లా, నాయకులు

మరింత బలం..

వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డితో కలిసి పని చేయడంతో నియోజకవర్గం వైఎస్ఆర్‌సీపీకి మరింత బలం చేకూరుతుందని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. 1989 నుంచి బుడ్డా కుటుంబంతో తనకు అవినాభావ సంబంధం ఉందని చెప్పారు. సీఎం ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డిని కలిసి ముందుకు వెళ్తామన్నారు. బుడ్డాను కలుపుకొని ఎన్నికల్లో పని చేసి మళ్లీ నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగురవేస్తామన్నారు. టీడీపీని ఓడించేందుకు అందరం ఐక్యంగా పని చేస్తామన్నారు. నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలందరం కలిసికట్టుగా పని చేస్తామని చెప్పారు.

సీఎం ఆదేశాలను ధిక్కరించలేదు..

పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్ ఆదేశాలను తాను ఎప్పుడూ ధిక్కరించలేదని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్ ఆశయాల కోసం మళ్లీ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు శ్రీశైలం నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం సమన్వయంతో పని చేస్తామన్నారు. రాజకీయాల్లో పది మందికి సాయం చేయాలన్నది మా తండ్రి బుడ్డా వెంగళరెడ్డి నుంచి నేర్చుకున్నానని, ఆ దిశగానే తాను పని చేస్తున్నానని చెప్పారు. చక్రపాణిరెడ్డికి విజయానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. గురువారం శిల్పా నామినేషన్ కార్యక్రమంలో అందరం పాల్గొని విజయవంతం చేస్తామని చెప్పారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

డోన్ టౌన్: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పట్టణ సమీపంలో జాతీయ రహదారిపై వెలసిన శ్రీదత్తాత్రేయ స్వామి గుడ్డి సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరంగా చేపట్టారు. రూరల్ ఎస్ఐ సుధాకర్ రెడ్డి, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి డీఈ సురేష్ ఆధ్వర్యంలో వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

హోం ఓటింగ్ కోసం నేటి నుంచి విచారణ

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ఎన్నికల సంఘం వయో వృద్ధులు(80 ఏళ్ల దాటిన వారు), దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి హోం ఓటింగ్ సదుపాయాన్ని కల్పించింది. ఈనేపథ్యంలో ఏప్రిల్ 18 నుంచి 21వ తేదీ వరకు బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్ఓ) ఇంటింటా తిరిగి హోం ఓటింగ్‌కు అర్హులైన ఓటర్లను గుర్తిస్తారు. వారిని కలసి హోం ఓటింగ్ ఆప్షన్ తీసుకుంటారా లేదంటే పోలింగ్ కేంద్రంలో ఓటు వేస్తారా అన్న విషయాలను సేకరిస్తారు.

క్లుప్తంగా

గురుకుల విద్యార్థులకు స్లైడింగ్ ఆప్షన్

కర్నూలు(అర్బన్): జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి మొదటి జాబితాలో ఎంపికై ప్రవేశం పొందిన విద్యార్థులకు స్లైడింగ్ ఆప్షన్ ఇచ్చినట్లు ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ డా.ఐ శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆప్షన్ ద్వారా తాము ప్రవేశం పొందిన గురుకుల పాఠశాల నుంచి వేరొక గురుకుల పాఠశాలకు బదిలీ అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు తాము ఎంపికైన పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఈ నెల 18 నుంచి 22వ తేదీ లోపు తల్లి/ తండ్రి/ సంరక్షకుని సంతకంతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించాలన్నారు. స్లైడింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మరింత సమాచారం కోసం 08518295601/ 9010070219 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి


షేక్‌అక్బర్ (ఫైల్)

నంద్యాల(అర్బన్):నంద్యాల మండలం మిట్నాల గ్రామంలో ఉపాధి కూలీ షేక్‌అక్బర్(62) వడదెబ్బతో బుధవారం మృతి చెందాడు. ఉదయం ఉపాధి పని చేస్తుండగా ఎండవేడిమి తాళలేక అక్బర్ అస్వస్థతకు గురయ్యాడు. తోటి కూలీలు అతనిని చెట్టు నీడకు తీసుకొని వెళ్లారు. పూర్తిగా నీరసించి పోవడంతో ఆయనను ఇంటికి చేర్చారు. సేదతీరుతూ ఒక్కసారిగా కుప్పకూలి కింద పడి మృతి చెందాడు.

తగ్గుతున్న టమాట ధర


నంద్యాల రైతు బజార్లో టమాట విక్రయాలు

నంద్యాల(సెంట్రల్): టమాట ధరలు తగ్గుముఖం పట్టాయి. ఐదు రోజుల క్రితం కిలో రూ.35 ఉన్న టమాట ధర క్రమేపీ తగ్గుతూ కిలో రూ.30కి చేరింది. బుధవారం రైతు బజార్లలో కిలో టమాట ధర రూ.20 పలికింది. వారం రోజుల్లో రూ.15 ధర తగ్గింది. ఇంకా ధర తగ్గే అవకాశం ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. దీంతో వినియోగదారులకు, సామాన్య మధ్యతరగతి ప్రజలకు కాసింత ఊరట లభించింది.


నగర పరిధిలో మూడు చెక్‌పోస్టుల ఏర్పాటు

కర్నూలు (టౌన్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టులు 24 గంటల పాటు పనిచేస్తాయి. సుంకేసుల రోడ్డు సమీపంలోని కార్తీక్ హాస్పిటల్, వై-జంక్షన్ ఏరియా జొహరాపురం, నంద్యాల చెక్‌పోస్టు వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో అక్రమ మద్యం, డబ్బును తరలించడాన్ని నియంత్రించేందుకు ఈ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఒక్కో చెక్‌పోస్టులో ఒక అధికారితో పాటు ముగ్గురు పోలీసులు పనిచేస్తారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు కర్నూలు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ తెలిపారు.

సాక్షిగణపతికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలావీరభద్రస్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

రౌడీ నేత.. భూముల మేత!



దౌర్జన్యంగా భూ కబ్జాలు

ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి వందల ఎకరాల భూమిని ఆక్రమించుకుని దౌర్జన్యంగా సాగు చేసుకుంటున్నాడు. తొలిశాపురం సమీపంలోని వందల ఎకరాల వక్ఫ్ బోర్డు భూమిని ఆక్రమించుకుని తన అనుచరులతో సాగు చేయిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఎదురూరు గ్రామంలో 70 ఎకరాలు చెన్నకేశవులస్వామి భూమిని ఆక్రమించుకుని ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్నాడనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ అధికారులు ఒత్తిడి తీసుకురాగా ఈ భూములకు కొంతవరకు భూమిశిస్తు చెల్లించినట్లు సమాచారం. కేసీ కెనాల్‌కు రంధ్రం పెట్టి ప్రతి ఏటా ఎదురూరు గ్రామం దగ్గర వందల ఎకరాల తన భూములకు అక్రమంగా నీటిని మళ్లించుకుని వరి సాగుచేసుకుంటున్నాడు. గార్గేయపురంలో 5 ఎకరాల చెరువు భూమిని నీళ్ల లేని సమయంలో సాగు చేసుకునేందుకు పేదవారికి పట్టాలిచ్చారు. ఆ భూమి హైవే రోడ్డుకు పక్కనే ఉండడంతో విష్ణువర్ధన్‌రెడ్డి కన్నుపడింది. కోట్ల విలువ చేసే ఆ భూమిని తన అనుచరుల మీద కొనుగోలు చేశాడు. ఆరు నెలల క్రితం ఆ చెరువును పూడ్చేందుకు ప్రయత్నించగా అధికారులు విచారణ చేసి పూడిక పనులను నిలుపుదల చేయించారు.

విష్ణువర్ధన్‌రెడ్డిపై నమోదైన కేసులు

ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ, దౌర్జన్యాలు, గొడవలు వంటి కేసులు నమోదయ్యాయి. కర్నూలు తాలుకా పోలీస్‌స్టేషన్, మూడు, నాలుగవ టౌన్ పోలీస్‌స్టేషన్లో 8 కేసులు ఉన్నాయి. సెక్షన్ 355, 365, 323 రెడ్‌విత్, ఐపీసీ 34 సెక్షన్ల కింద 244/2011 కేసు నమోదైంది. 147, 447, 506 సెక్షన్ల కింద క్రైం నెంబర్ 179/2013 ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. దీంతో పాటు క్రైం నెంబర్ 45/2009, 40/2016, 21/2013, 232/2019, 244/2011, 179/2013, 45/2016, 85/2019 పలు కేసులు నమోదయ్యాయి. ఎక్కువగా ఎస్సీ, ఎస్టీలను వేధింపులకు గురిచేసి దాడులు చేసిన కేసులే విష్ణువర్ధన్‌రెడ్డిపై నమోదయ్యాయి.

ఎన్నికల్లో విష్ణు సృష్టించిన గొడవలు ఇవీ..

- ఎన్నికలు వచ్చాయంటే విష్ణువర్ధన్‌రెడ్డి పూనకాలు వచ్చినట్లు ఊగిపోతాడు. ఎన్నికల్లో నేరుగా తానే స్వయంగా వెళ్లి దొరికిన ఆయుధాలతో దాడులకు తెగబడడం ఆయనకు అలవాటుగా మారిపోయింది.
- 1985లో పార్లమెంట్ ఎన్నికల్లో ఏరాసు అయ్యపురెడ్డికి కేఈ సోదరులు మద్దతిచ్చి మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఓటమికి కారణమయ్యారనే కోపంతో కేఈ సోదరుల ఇంటిపై రౌడీమూకలతో దాడి చేయించాడు. అప్పట్లో కర్నూలు పాతబస్టాండ్ మొత్తం బీభత్సకరమైన వాతావరణం ఏర్పడింది.
- 1994లో ఆలంపూర్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి పోటీచేసిన సమయంలో ప్రత్యర్థి కొత్తకోట ప్రకాష్‌రెడ్డి బ్యాలెట్ బాక్స్‌ల్లో ఇంకు పోశాడన్న నెపంతో విష్ణువర్ధన్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి కొత్తకోట ప్రకాష్‌రెడ్డి అనుచరులను దాదాపు 35 మందిని గాయపరిచినట్లు అలంపూర్ పీఎస్‌లో కేసు నమోదైంది.
- 1998లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డికి మద్దతుగా ఉంటూ ఆ ఎన్నికలో స్వయంగా దౌర్జన్యానికి దిగాడు. కల్లపరిలో తెలుగుదేశం పార్టీ ఏజెంట్‌పై దాడి చేసేందుకు ప్రయత్నించగా గ్రామస్తులంతా తిరగబడ్డారు. చివరకు పరిస్థితి విషమించడంతో ఒక ఇంటిలో విష్ణువర్ధన్‌రెడ్డిని బంధించారు. ప్రజలు శాంతించిన తర్వాత ఆ గ్రామ నాయకుడు యువీ రాజారెడ్డి వచ్చి విష్ణును క్షేమంగా ఊరు దాటించాడు.
- 1999 ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయంలో కాంగ్రెస్ పార్టీకి పడిన ఓట్లు టీడీపీ అభ్యర్థి టీజీ వెంకటేష్‌కు పడుతున్నాయని పుల్లారెడ్డి కాలేజీలో పెద్ద ఎత్తున విష్ణువర్ధన్‌రెడ్డి గొడవ చేశాడు. ఓ దశలో అప్పటి ఎమ్మెల్యే ఎం.శిఖామణిపై దాడి చేసేందుకు ప్రయత్నించగా విష్ణును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
- మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడిగా తొలగించాలని కర్నూలు జిల్లా నుంచి 50 నుంచి 60 లారీల్లో జనాలను హైదరాబాద్‌కి తీసుకెళ్లి పీసీసీ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున అలజడి సృష్టించాడు.
- 2014 ఎన్నికలనంతరం కోడుమూరు నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్లను తీసుకెళ్లి తెలుగుదేశం పార్టీలో చేర్పించి కోడుమురు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్‌గా పవర్ పెత్తనం నడిపాడు.
- 2019 ఎన్నికలో తెలుగుదేశం పార్టీలో ఉంటూ తన చిరకాల ప్రత్యర్థి అయిన కొత్తకోట ప్రకాష్‌రెడ్డిపై గొందిపర్లలో దాడికి తెగబడ్డాడు. తన అనుచరులను ఉసిగొల్పి కొత్తకోట ప్రకాష్‌రెడ్డిపై దాడి చేయించిన ప్రయత్నం అప్పట్లో సంచలనం రేకెత్తించింది.

- టీడీపీ నేత విష్ణువర్ధన్ రెడ్డిపై అనేక ఆరోపణలు
- ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు
- ఎన్నికల సమయంలో గొడవలకు దిగుతున్న వైనం
- పోలీస్ స్టేషన్లలో పలు కేసుల నమోదు
- ఎదురూరులో యథేచ్ఛగా భూకబ్జాలు!

కర్నూలు: టీడీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి వివాదాలు సృష్టిస్తూ.. ముఠా కక్షలను ప్రోత్సహిస్తూ రాజకీయాలు చేస్తున్నారు. పచ్చని పల్లెలో గొడవలకు ఆజ్యం పోస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. 1985 నుంచి 1995 వరకు కర్నూలు, సి.బెళగల్, గూడూరు, కల్లూరు మండలాల్లోని ఎన్నో గ్రామాల్లో ఫ్యాక్షన్ గొడవలకు ఈయనే కారణమని విమర్శలు ఉన్నాయి. పర్ల, పోల్‌కల్, కొంతలపాడు, బురాన్‌దొడ్డి, పులకుర్తి, మునగాల, సుంకేసుల తదితర గ్రామాల్లో హత్యలు చేసిన వారిని ఈయన ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నికలు జరిగిన ప్రతి సందర్భంలోనూ ఏదో విధంగా గొడవలు సృష్టించడం, ప్రజలను భయాభ్రాంతులకు గురిచేయడం ఈయనకు అలవాటుగా మారింది. ఎన్నికల్లో అశాంతిని నెలకొల్పి గొడవలు సృష్టించడంలో ఈయన అత్యంత ప్రమాదకరమైన వ్యక్తిగా పోలీసులు రికార్డుల్లో నమోదయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో తాను సూచించిన వ్యక్తి బొగ్గుల దస్తగిరికి సీటు ఇస్తేనే పనిచేస్తాను, లేదంటే ఎవరికి టికెట్ ఇచ్చినా ఓడిస్తానని అధిష్టానానికి అల్టిమేటం పెట్టి తన పట్టును సాధించుకున్నారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబుతో పట్టుబట్టి బూర్ల రామాంజినేయులకు అసెంబ్లీ టికెట్ సాధించుకున్నా విష్ణు సొంత గ్రామాలైన ఎదురూరు, దూద్యాల, కొంతలపాడు, సుంకేసుల గ్రామాల్లో ఆ పార్టీకి మెజార్టీ రాకపోవడం గమనార్హం.

కప్పగంతులు

ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డికి రాజకీయాల్లో విలువలు లేవు. పార్టీలు మారడం ఈయనకు రివాజుగా మారింది. ఈయన రాజకీయ ప్రస్థానం తెలుగుదేశం పార్టీతో మొదలైంది. 1994లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అప్పట్లో విజయభాస్కర్‌రెడ్డితో విభేదించి 1998లో టీడీపీలో చేరారు. అనంతరం 2004లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ తరఫున పాణ్యం నియోజకవర్గం అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయాడు. మళ్లీ టీడీపీలోకి చేరి కోడుమూరు నియోజకవర్గంలో పెత్తనం నడుపుతున్నారు.


గార్గేయపురం దగ్గర చెరువు భూమిని ఆక్రమించి రోడ్డు వేసిన దృశ్యం (ఫైల్)


కర్నూలులో చిన్నారికి ఎండ తగులకుండా తీసుకెళ్తున్న మహిళ

సూర్య @ 44.9

కర్నూలు(అగ్రికల్చర్): ఎండలు, వడగాడ్పుల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. భానుడు తన కిరణాలతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. బుధవారం బండిఆత్మకూరులో 44.9, మహానందిలో 44.73, పాణ్యం మండలం గోనవరంలో 44.37, బనగానపల్లెలో 44.26, మిడుతూరులో 44.1, గోస్పాడులో 44.06, మంత్రాలయం మండలం వేముగోడులో 44.0, కోడుమూరు మండలం లద్దగిరిలో 43.79, ఓర్వకల్లు మండలం శకునాలలో 43.29 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ప్రమాదం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు.

అహోబిలంలో వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో సీతారామచంద్రులు, లక్ష్మణ స్వామి

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను ప్రత్యేక పల్లకీలో కొలువుంచి అహోబిలం మఠంలో వెలసిన సీతారామ సన్నిధికి తోడ్కొని వచ్చారు. సీతారామచంద్రుడు, లక్ష్మణ స్వాములకు, శ్రీదేవి, భూదేవి, సమేత ప్రహ్లాదవరద స్వాములకు అభిషేకం, అర్చన, తిరుమంజనం నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను నూతన పట్టుపీతాంబరాలతో అలంకరణ చేసి కొలువుంచారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి ఉత్సవ మూర్తులకు మాడ వీధుల్లో వైభవోపేతంగా గ్రామోత్సవం నిర్వహించి కార్యాక్రమాన్ని ముగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సింహవాహనంపై శ్రీరంగనాథుడు


సింహవాహనంపై ఆశీనుడైన స్వామివారి ప్రభోత్సవ వాహనాన్ని గ్రామ పురవీధుల్లో తిప్పుతున్న భక్తులు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీ లక్ష్మీ రంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు బుధవారం స్వామివారు సింహ వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి ప్రభోత్సవ వాహనం వరకు భక్తులు తీసుకొచ్చారు. సింహవానంతో అలంకరించిన ప్రభోత్సవ వాహనంపై స్వామివారిని ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

యువకుడి ఆత్మహత్య

నందికొట్కూరు: పట్టణంలోని హాజీనగర్‌కు చెంది న ఓ యువకుడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు.. హాజీనగర్‌కు చెందిన రాజేష్ (30), శిరీష దంపతులకు నలుగురు ఆడ పిల్లలు ఉన్నారు. కార్పెంటర్‌గా పని చేస్తున్న రాజేష్ పలుమార్లు చనిపోతానంటూ బెదిరించేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం అతను నేషనల్ హైవే రోడ్డుకు సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిలకడగా ఎండుమిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్):పట్టణంలోని టెక్కె మిర్చి యార్డులో నిలకడగా కొనసాగుతున్నాయి. బుధవారం యార్డులో సూపర్-10 రకం క్వింటాలు గరిష్ట ధర రూ.15,000, మధ్యస్థ ధర రూ.9,500, కనిష్ట ధర రూ.8,000గా పలికింది. ఇదే రకం తాలుకాయ జనరల్ క్వింటాలు గరిష్ట ధర రూ.4,700, మధ్యస్థ ధర రూ.4,300, కనిష్ట ధర రూ.4,000గా నమోదైనట్లు యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


కారు ఢీకొని మృతి చెందిన రామాంజి

ఆలూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో రామాంజి (38) అనే వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని పెద్ద హోతూరు గ్రామం సమీపంలో బుధవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. గొడవ జరిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు పెద్దహోతూరు గ్రామానికి చెందిన రామాంజిని మోటారు సైకిల్‌పై ఆలూరుకు వెళ్తుండగా కర్నూలు వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామాంజి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయనకు భార్య,ముగ్గురు పిల్లలు ఉన్నారు.

తేలు కాటుకు గురైన బాలుడి మృతి


విజయ్ (ఫైల్)

పత్తికొండ రూరల్: పత్తికొండలోని చక్రాళ్ల రోడ్డులో నివాసం ఉంటున్న చాగి పరమేష్, పార్వతి దంపతుల కుమారుడు విజయ్ (13) తేలుకాటుకు గురై బుధవారం మృతి చెందాడు. వీరికి ముగ్గురు కుమారులు కాగా చిన్నవాడైన విజయ్ 5వ తరగతి వరకు చదివాడు. బడి మానేసి తల్లిదండ్రులతో పాటు పొలం పనులకు వెళ్తుండేవాడు. ఈ నెల 2న పొలం పనులకు వెళ్లి తేలుకాటుకు గురై విష ప్రభావంతో అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక బుధవారం మృతి చెందారు.

లింగనిర్ధారణ పరీక్షలు చట్టప్రకారం నేరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): లింగనిర్ధారణ పరీక్షలు చట్ట ప్రకారం నేరమని, దీన్ని అరికట్టాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం గర్భస్థ పిండ పరీక్ష ప్రక్రియ-నియంత్రణ, దుర్వినియోగ నివారణ చట్టం-1994ను అమలులోకి తెచ్చిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. స్థానిక మహిళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఆశా శిక్షణ కార్యకర్తల కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా లింగ వివక్షత నిర్మూలన, గర్భస్థ లింగనిర్ధారణ వ్యతిరేక చట్టం, ఆడపిల్లల ప్రాముఖ్యతపై మాట్లాడారు. ఈ చట్టాన్ని అతిక్రమించిన వైద్యులు, ప్రోత్సహించిన వారిపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, వారిద్దరి మధ్య ఏ వివక్షా ఉండకూడదన్నారు. నిజానికి పురుషుడి కంటే స్త్రీ ఏ విషయంలోనూ తక్కువ కాదని, అందుకే ఈనాడు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా స్త్రీలు రాణిస్తున్నారని చెప్పారు. ఈ విషయాలపై ఆశా కార్యకర్తలు ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీపీహెచ్‌ఎన్‌ఓ ఇందిర, డెమో ప్రమీలాదేవి, హెచ్‌ఈఈఓ శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, పీసీ పీఎన్‌డీటీ మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత, డీసీఎం ప్రసాద్, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

సంక్షేమ బావుటా

సీఎం జగన్ చేసిన మేలును మర్చిపోం



ఉన్న రెండెకరాలతో పాటు మరో ఆరు ఎకరాలు గుత్తకు తీసుకొని నాభర్త చిన్న సుంకన్న, నేనూ వ్యవసాయ పనులు చేసే వాళ్లం. మాకు కొడుకు నాగేంద్ర, కూతురు నాగేంద్రమ్మ ఉన్నారు. ఇద్దరికీ పెళ్లిళ్లు అయిపోయాయి. టీడీపీ హయాంలో వానలు పడక నష్టాలు వచ్చాయి. అప్పులు రూ.6లక్షలకు పైగా చేరుకోవడంతో వాటిని తీర్చేమార్గం లేక నా భర్త చిన్న సుంకన్న రెండేళ్ల క్రితం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన చనిపోయిన తర్వాత మేం చాలా ఇబ్బందులు పడ్డాం. అప్పుల వాళ్లనుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. అలాంటి సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతు ఆత్మహత్య పరిహారం కింద రూ.7లక్షల చెక్కు నేరుగా నా ఖాతాకే జమ చేశారు. ఆ డబ్బుతో మొత్తం అప్పులు కట్టేశాం. ఆ పరిహారమే మా పరువు కాపాడింది. నాకు వింతంతు పింఛన్ కూడా మంజూరైంది. వైఎస్సార్ చేయూత కింద రెండు విడతల్లో మాకు రూ.37,500 వచ్చాయి. పరిహారం రాకుండా ఉంటే పొలం అప్పులకు అమ్మాల్సి వచ్చేది. సీఎం జగన్ సాయంతో మళ్లీ ఉన్న పొలంలో వ్యవసాయం చేసుకుంటూ ఇప్పుడు ఉన్నంతలో హాయిగా బతుకుతున్నాం. ఆయన మేలును ఎప్పుడూ మర్చిపోం.

– మూల మునెమ్మ, రాతన గ్రామం, తుగ్గలి మండలం

జగనన్నకు రుణపడి ఉంటాం


జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

మాకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. నేను ఆటో నడపుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడిని. ఎనిమిది నెలల క్రితం ఆస్పరి వద్ద లారీ ఢీ కొట్టడంతో నాకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు వెళితే అక్కడ వైద్యులు ఒక కాలు తీసేశారు. వైద్యానికి చాలా డబ్బులు ఖర్చయ్యాయి. అప్పులు చేశాం.కుటుంబం గడవడం కష్టంగా ఉండటంతో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాకు రూ. 3.50 లక్షలు ఆర్థిక సాయం చేశారు. ఇందులో రూ.3 లక్షల అప్పు తీర్చి రూ. 50 వేలతో శంకరబండ గ్రామంలో కిరాణా షాపు పెట్టుకున్నాం. మాలాంటి నిరుపేద కుటుంబానికి సాయం చేసిన

– హనుమంతు, శంకరబండ గ్రామం, ఆస్పరి మండలం